క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి పేరు పెట్టాలి



ధన్వాడ: నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయానికి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్‌కు గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజు వినతిపత్రం అందజేశారు. ధన్వాడ మండల ఏర్పాటు కోసం నర్సిరెడ్డి కృషి చేశారని, అంతే కాకుండా ధన్వాడలో అభివృద్ధి కోసం ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఎంపీ డీకే అరుణలు నిత్యం కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకే తహసీల్దార్ కార్యాలయానికి ఆయన పేరు పెట్టాలని వినతిలో కోరారు.

ఉపాధ్యాయుడికి కన్నీటి వీడ్కోలు

ఊట్కూర్: మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిడుగుర్తి పాఠశాలలో లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం సంతాప సూచకంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. డీఈఓటీ ఎండీ అబ్దుల్ ఘనీ, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కమలాకర్‌రావు, మాజీ అధ్యక్షుడు గట్టు వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, అరవింద్‌కుమార్, నాయకులు బిల్లర్ తాయప్ప, రాజుల ఆశిరెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. సోమవారం ఊట్కూర్‌లోని ఆయన వ్యవసాయ పొలంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మృతుడికి భార్య గౌరేశ్వరి, కుమారుడు శ్రేయష్, కుమార్తె వర్షిత ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి రాజీనామా

మద్దూరు: ఉమ్మడి మండలంలోని దుప్పట్‌గట్టు పంచాయతీ కార్యదర్శి మీర్ బాసిత్ అలీ తన ఉద్యోగానికి సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ కార్యలయంలో సూపరింటెండెంట్ వెంకటకృష్ణకు అందజేశారు. 2003లో విధుల్లో చేరిన ఆయన గ్రేడ్3 పంచాయతీ కార్యదర్శిగా కొనసాగారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతానికి గురైన పంచాయతీ సిబ్బంది


వెంకట్రాములు

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో పంచాయతీ కార్మికుడు వెంకట్రాములు సోమవారం వీధి దీపాలు బిగిస్తూ విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే గ్రామస్తులు మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సోమవారం పంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి బాలస్వామి ఆదేశాల మేరకు స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసేందుకు ట్రాన్స్‌కో అధికారుల అనుమతితో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్తంభాలపై హై టెన్షన్ వైర్లు వెళ్తుండటంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని పంచాయతీ కార్యదర్శి బాలస్వామి తెలిపారు.

తెగిన వైరు.. తప్పిన ప్రమాదం



మాగనూర్: ఎన్‌హెచ్–167 పక్కన ప్రధాన విద్యుత్ వైర్ తెగి పడి గంటలు గడుస్తున్నా.. సమాచారం తెలిసినా విద్యుత్ అధికారులు మాత్రం స్పందించకపోడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నల్లగట్టు మారెమ్మవ్వ ఆలయం సమీపం నుంచి కస్తూర్బగాంధీ బాలిక విద్యాలయం వరకు ప్రధాన విద్యుత్ వైర్ సోమవారం తెల్లవారు జామున సమీపంలోని ఓ ఇటుక బట్టీకి చెందిన లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్ల తెగిపడింది. వైరు తెగి గంటలు గడిచినా ఎవరూ పట్టించుకోలేదు. చివరికి విద్యుత్ వైర్లకు దూరంగా రాళ్లు ఏర్పాటు చేసిన స్థానికులు అటుగా ప్రయాణికులను నియంత్రించారు. అనంతరం ఆలస్యంగా వచ్చిన విద్యుత్ సిబ్బంది మరమ్మతు నిర్వహించారు.

కొత్త చట్టాలతో సత్వర న్యాయం


నారాయణపేటలో మాట్లాడుతున్న సీఐ శివశంకర్


మరికల్‌లో మాట్లాడుతున్న సీఐ రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/మరికల్/కోస్గి/మద్దూరు: బ్రిటీష్ నాటి కాలం చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలతో వెంటనే న్యాయం జరుగుతుందని మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, నారాయణపేట సీఐ శివశంకర్, కోస్గి సీఐ సోమనర్సయ్య, మద్దూరు ఎస్‌ఐ రాంలాల్ అన్నారు. సోమవారం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం అమలు చేసిన కొత్త చట్టాలు ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చాయన్నారు. మైనర్ బాలికలపై అత్యాచారం చేస్తే ఇప్పటి నుంచి ఉరి శిక్ష విధిస్తారని తెలిపారు. పాత చట్టాల ప్రకారం చూస్తే ఏదైనా ప్రమాదానికి కారణమైన వారికి రూ.500 జరిమాన ఉండేదని, ప్రస్తుతం రూ.5 వేలకు పెంచారని పేర్కొన్నారు. అలాగే ఘర్షణ కేసుల్లో చేతులతో కొడితే రూ.వెయ్యి ఉన్న జరిమానా రూ.10 వేలకు, కర్రలతో దాడి చేస్తే రూ.వెయ్యి ఉన్న జరిమానాను రూ.20 వేలకు పెంచడమే కాకుండా జైలు శిక్ష కూడా పడుతుందన్నారు. ఇప్పటి నుంచి జీరో ఎఫ్ఐఆర్ సౌకర్యం కూడా అందుబాటుల్లోకి రానుందన్నారు. రహదారులపై ప్రయాణిస్తున్న వారిని గుర్తు తెలియని వాహనదారులను ఢీకొట్టి వెళ్తుంటారని, అలా వెళ్లిన వారికి ఇక నుంచి పదేళ్ల జైలు శిక్ష పడనుందన్నారు. ప్రమాదానికి కారణమైనప్పుడు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ప్రమాద వివరాలు చెప్పి, ఘటన స్థలం నుంచి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వారికి స్టేషన్ బెయిల్ వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం అమలు అవుతున్న కొత్త చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ మురళి పాల్గొన్నారు.

మద్దూరు: దేశం మొత్తం గతంలో ఉన్న చట్టాల్లో కొన్ని మార్పులు చేస్తూ వాటిలో కొన్నింటిని కఠినతరం చేస్తూ ప్రజలకు అనువుగా ఉండేటట్లు, చట్టాలను అతిక్రమించే వారి పట్ల కఠినమైన శిక్షలు పడేటట్లు రుపొందించాలని మద్దూరు ఎస్‌ఐ రాంలాల్ సోమవారం తెలిపారు. గతంలో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీ నాగరిక్ సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అదినీయం వచ్చాయని గుర్తు చేశారు. ఈ కొత్త చట్టాలు దేశం మొత్తం నేటి నుంచి అమల్లోకి వచ్చిన అయన పేర్కొన్నారు. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకొవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు..

బాధితులు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లకుండా ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకోవచ్చని సీఐలు అన్నారు. కేసు నమోదు చేయడానికి ఫిర్యాదుదారుడి డిజిటల్ సంతకం తప్పకుండా ఉండాలని, లేని ఎడల మూడు రోజుల్లో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం చేయాలని సూచించారు.

‘రైతుభరోసా’కు పరిమితి విధించాలి


మాట్లాడుతున్న డీసీఓ కోదండరాం

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా పథకానికి పదెకరాల వరకు పరిమితి విధించాలని రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. సోమవారం ఎంపీపీ నర్సప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప సమక్షంలో మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహకార సంఘం డీసీఓ కోదండరాం మాట్లాడుతు రైతుభరోసా పథకంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై రైతులతో చర్చించారు. రైతుల సలహాలు సూచనలు సేకరించారు. అధిక సంఖ్యాకులు కనీసం పదెకరాలకు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు జీఎస్‌టీ పన్నులు కట్టిన వారికి అందించే విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, ఎంపీపీ నర్సప్ప, ఏఈఓలు, కాంగ్రెస్, టీఆర్ఎస్, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



మక్తల్: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బీమా అధ్యక్షుడు అంబదాస్ రావు అన్నారు. సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది రోగులకు పరీక్షలు చేయగా 60 మంది కంటి పొరల సమస్య ఉందని గుర్తించి ఆపరేషన్ కోసం మహబూబ్‌నగర్ ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. జిల్లా చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు, పృథ్వీరాజ్, చంద్రకాంత్‌గౌడ్, డీవీచారి, సత్యనారాయణ, శరణప్ప, నరేందర్, వాదిరాజ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ధన్వాడ: ప్రజా పాలనలో భాగంగా విద్యుత్ జీరో బిల్ రాని వారి నుంచి సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్తులు తమ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. దరఖాస్తు చేసేందుకు ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఓటీపీ వస్తుందని, ఓటీపీ వచ్చేందుకు సమయం పట్టడంతో దరఖాస్తులు ముందుకు వేళ్లేందుకు సమయం పడుతుందన్నారు. దరఖాస్తులు ఇచ్చిన వారికి రసీదు అందజేస్తామని, వారి నంబర్ వచ్చినప్పుడు దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ గ్రామస్తులను కోరారు.

సదరం దరఖాస్తుల ఆహ్వానం

ధన్వాడ: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం, శుక్రవారం నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నారని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ కోరారు. అలాగే చెవిటి, మానసిక వికలత్వానికి సంబంధించిన వ్యాధులకు ప్రతి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి 31వ తేదీ వరకు సమీపంలోని మీసేవ సెంటర్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సీఎస్‌ఈ సెంటర్ ప్రారంభం



నారాయణపేట: మండలంలోని కోటకొండలో సోమవారం రేషన్ డీలర్ దుకాణంలో సీఎస్‌ఈ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ఆన్‌లైన్ సర్వీస్ సేవలు ప్రారంభించడం ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ప్రజలకు అన్ని సేవలు అందించాలని వారిని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రాజు ప్రభంజనరావు, లక్ష్మారెడ్డి, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతారాయం

మరికల్: మండల కేంద్రంలో మంగళవారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ రవికాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 10.30 నుంచి 12.30 గంటల వరకు మరికల్‌లోని నారాయణపేట రోడ్డు పక్కల విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేస్తున్నారని తెలిపారు. అశోక్‌నగర్, సినిమా థియేటర్, మాణికేశ్వరీ ఆలయం ఏరియా, బీసీ కాలనీ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకారించాలని కోరారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ అజెండా


మాగనూర్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: పేదల సంక్షేమమే అజెండా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో రాష్ట్రం సుస్థిర అభివృద్ధి జరుగుతుందన్నారు. మరిన్ని నిధులు నియోజకవర్గానికి తీసుకొచ్చి మక్తల్ ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీలు గడ్డంపల్లి హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మండల గణేష్‌కుమార్, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీటీసీ తిమ్మప్ప, మత్స్యశాఖ మాజీ చైర్మన్ కోళ్ల వెంకటేష్, కౌన్సిలర్లు శంకరమ్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి తాయప్ప, చెన్నకేశవరెడ్డి, నర్సిములు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మండల ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ పాటిల్, ఎంపీపీ పూర్ణిమ పాటిల్, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, మోనేష్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, నాయకులు పల్లె సురేష్, మహాదేవ్, అంజప్పగౌడ, నాగప్ప, నాయకులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి 48 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, డీటీ సురేష్, ఆర్ఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లపై మమకారం


సింగారంలో బదిలీపై వెళ్తున్న టీచర్లను అడ్డుకుంటున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలోని సింగారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. అక్కడి పాఠశాలలో 12 ఏళ్లుగా పనిచేస్తున్న వెంకటయ్య ఎక్లాస్పూర్‌కు, ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న నర్సింహులు అప్పిరెడ్డిపల్లికి బదిలీ అయ్యారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు వారు పాఠశాల నుంచి బయటికి వెళ్లున్న సమయంలో వారి ద్విచక్రవాహనాలను ముందుకు వెళ్లనీయకుండా వారిని పట్టుకుని రోధించారు. మీరు ఎక్కడికి వెళ్లకూడదని, ఇక్కడే విధులు నిర్వహించాలని వేడుకున్నారు. ఏళ్లుగా వారితో కలిసి ఉన్న టీచర్లు వెళ్లడంతో పిల్లలతో పాటు గ్రామస్తులు బాధపడ్డారు. చివరికి పలువురు గ్రామస్తులు వచ్చి సముదాయించడంతో విద్యార్థులు అడ్డు తప్పుకున్నారు.

నిత్యం ప్రజల్లో ఉండాలి


ఎంపీపీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: ప్రజాప్రతి నిధులుగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, పదవి ఉన్నా, లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే మళ్లీ గుర్తింపు లభిస్తుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారంపై దృష్టిని సారించాలన్నారు. ఇక్కడున్న వారంతా మళ్లీ ప్రజాప్రతి నిధులుగా ఎన్నికై రావాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా పంచాయతీ కార్యదర్శులు దృష్టిని సారించాలన్నారు. ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గట్టు మండలానికి ఎంతో సేవ చేసినట్లు తెలిపారు. కాల్వల ద్వారా సాగు నీరందించడంతో వలసలు వెళ్లే ప్రాంతం నుంచి ఇక్కడికే ఇతర ప్రాంతాల వారు వలస వచ్చే పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలు, గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ బాసు శ్యామల మాట్లాడుతూ రెండు పర్యాయాలు జెడ్పీటీసీగా ఆదరించిన గట్టు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నట్లు వైస్ ఎంపీపీ సుమతి తెలిపారు. అనంతరం ఎంపీటీసీలను, అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, సీడీపీఓ కమలాదేవి, తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ చెన్నయ్య, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గుట్కా పాకెట్ల పటివేత

మక్తల్: పట్టణంలోని గురుస్వామికి చెందిన కిరణా షాపులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి నిషేధిత అంబర్ జర్దా, గుట్కా ప్యాకెట్లను సోమవారం పట్టుకున్నారు. దాదాపు రూ. 5 వేల విలువైన పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గురుస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కృష్ణా: మండల కేంద్రంలోని గజ్జి రాకేష్ కిరాణంలో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి దాదాపు రూ.9,335 విలువైన నిషేధిత గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్ నవీద్ తెలిపారు.

వైద్యులకు సన్మానం

కోస్గి: వైద్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సీనియర్ డాక్టర్ దిడ్డి. వెంకటయ్య, డాక్టర్ పూర్ణచందర్‌యాదవ్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సన్మానించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు బస్వరాజ్ మాట్లాడారు. నాయకులు రాంచందర్, నరేష్, ఎన్‌టీఆర్ ఫణింద్ర, సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఆత్మకూర్: మహిళలు పొదుపు సంఘాల ద్వారా రుణాలు పొంది పురుషులకు దీటుగా ఆర్థికంగా రాణించాలని ఏపీఎం వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో స్వయం సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వడ్డీ లేని రుణాలు పొంది సకాలంలో రుణాలను తిరిగి చెల్లించాలని కోరారు. ఖర్చులు, లావాదేవీలు సంఘం సభ్యులతో చర్చించాలని, వ్యక్తిగతంగా ఖర్చులు చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. అలాగే మండలానికి 45 పాడి పశువుల యూనిట్లు, పెరటితోటలు, కోళ్లపెంపకం 100 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు.



విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు


మాట్లాడుతున్న డాక్టర్ కిరిటీ

మరికల్: విద్యార్థులకు వారానికోసారి అందజేసే రక్తహీనత నివారణ మాత్రలపై వైద్యాధికారి కిరిటీ మరికల్‌లో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి అనారోగ్య సమస్యలతో బాధపడకుండా ఉండేందుకు అందజేస్తున్న రక్తహీనత నివారణ మాత్రలను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. ఇందుకు కావాల్సిన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మనోరంజని, సిబ్బంది అరవింద్, ప్రవీణ్‌కుమార్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమంగా కంపౌండ్‌వాల్ నిర్మాణం



ధన్వాడ: మండలంలోని మందిపల్లి గ్రామ పంచాయతీ బోరు పైపులైన్‌పై కంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఎంపీఓ వెంకట్వేశర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించడంతో పాటు ఇప్పుడు కంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుడు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నీటి సమస్య ఏర్పడిన పైపులు తీసేందుకు రాకపోవడంతో పాటు పక్క స్థలం లేకపోవడంతో బీటీ రోడ్డు తొలగించి పైపులు వేయాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ

మద్దూరు: రాష్ట్రంలో పంట పెట్టుబడి సాయం(రైతు భరోసా)పై దమ్‌గాన్‌పూర్ పీఏసీఎస్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా మద్దూరులోని ఎంపీడీఓ కార్యలయం ఎదుట సోమవారం రైతులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి జాన్‌సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు సమక్షంలో అభిప్రాయాలు తీసుకున్నారు. భిన్న అభిప్రాయాలను క్రోడీకరించి రాష్ట్రధికారులకు నివేదిక అందజేస్తామని ఏడీఏ తెలియజేశారు.

వైద్యులు దైవంతో సమానం


నారాయణపేటలో వైద్యుడిని సన్మానిస్తున్న ఎస్పీ బాలుఫ్యాన్స్


మక్తల్‌లో సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట: వైద్యులు దైవంతో సమానమని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో జనరల్ ఫిజిషియన్ గందె కార్తీక్‌కుమార్‌ను సత్కరించి మొక్కను అందజేశారు. బహుకరించారు. సంగ నర్సింహులు, వసంత్ కుమార్, రామకృష్ణ, హరీష్, ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని తీలేర్ లిటిల్‌స్టార్ పాఠశాల ఆవరణలో వైద్యులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామచంద్రయ్యగౌడ్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని పల్లె దవాఖానలో డాక్టర్లు విరోజ, మల్లికార్జున్, నవీన, వినోద్, సమీనా, వెంకటరమణ, సుమనలను కాచ్‌వార్ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డిలు సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ సరోజీనీమట్ట, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ద్యావరింటి నర్సింహరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి నాగజ్యోతిని సన్మానించారు. అనంతరం భారతరత్న అవార్డు గ్రహీత డాక్టబీసీ రాయ్‌కు నివాళులర్పించారు. ఆర్ఎంపీల సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తాయప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజహుస్సేన్, రాంచందర్, నర్సిములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వైద్యులను సన్మానిస్తున్న లంకాల్ బాబుమియ్యా

నర్వ: మనుషుల ప్రాణాలను కాపాడే వైద్యులు దైవంతో సమానమని రాష్ట్ర ప్రైవేటు నర్సింగ్‌హోం, స్టాఫ్‌నర్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బాబుమియ్యా అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వైద్యులను ఆయన శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యురాలు సమీనబేగం, ప్రైవేటు వైద్యులు డా. వెంకటేశ్వర్‌రావు, డా. శంకర్, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, ప్రభాకర్‌జెట్టి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వీపర్ కుటుంబానికి ఆర్థికసాయం


బాధిత కుటుంబానికి నగదును అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: మండలంలోని ముస్తాపేట్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే స్వీపర్ మహ్మద్‌గౌస్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ లాలప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజిలయ్యగౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పాఠశాలలో చాలీచాలని వేతనంతో పనిచేసి మృతిచెందిన మహ్మద్‌గౌస్ కుటుంబానికి తమ వంతుగా ఆర్థికసాయం అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిములు, శివకుమార్, నర్సింహ పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డికి ఘన నివాళి

మరికల్: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మరికల్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్ కుమార్, వీరన్న, సూర్యప్రకాష్, మోహన్ రెడ్డి, మొగులప్ప, కృష్ణయ్య, హరీష్, గోపి, ఎల్లప్ప పాల్గొన్నారు.

